క్లుప్తంగా

ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత కలుగుతుందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఓల్డ్ సిటీలోని శ్రీశైల సమాచార కేంద్రంలో ఏర్పాటు చేసిన శివ స్వాములకు శనివారం బిక్షా, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ చేసి, గో గ్రాసం పెట్టారు. కార్యక్రమంలో ఒకటవ వార్డు కార్పొరేటర్ షాషావలి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్‌లో చోరీ

కర్నూలు(టౌన్): ఇంటికి తాళం వేసి హోటల్‌కు వెళ్లి వచ్చేలోపు ఓ ఇంట్లో చోరీ జరిగింది. శనివారం స్థానిక నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్‌లో నివసించే జాహ్నవి అనే మహిళ కొత్తబస్టాండ్ వద్ద అతిథి హోటల్ నిర్వహిస్తోంది. హోటల్ పనుల్లో భాగంగా ఉదయం ఇంటికి తాళం వేసి హోటల్‌కు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చేలోపు నాలుగు తులాల బంగారం, రూ.15 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ చోరీకి గురయ్యింది. తలుపులు తెరచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని చోరీ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ల్యాబ్‌టెక్నీషియన్లకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): మలేరియా విభాగంలో పనిచేసే ల్యాబ్‌టెక్నీషియన్లకు హ్యాండ్స్ ఆన్ అనే శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలకు అనుగుణంగా శనివారం నగరంలోని మెడిటేరియన్ ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్‌లో 20 మంది ల్యాబ్‌టెక్నీషియన్లకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. మైక్రోస్కోపి, రిజిస్టర్స్, రికార్డ్స్, చార్ట్స్ ఎలా నిర్వహించాలనే విధానంపై వీరికి విపులంగా వివరించినట్లు పేర్కొన్నారు.

మాజీ సైనికుడి దాతృత్వం

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పీ లింగాపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు తుమ్మకొమ్మ విజయరాజు జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయానికి రూ.40 వేలు విలువ చేసే ఐరన్ అలమారాలను విరాళంగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాచయ్య అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పెద్ద మొత్తంలో వస్తువులను సైనిక సంక్షేమ శాఖ కార్యాలయానికి విరాళంగా ఇవ్వడం ఇదే ప్రథమం అన్నారు. ఈ నేపథ్యంలోనే దాత విజయరాజును ఘనంగా సన్మానించారు.

శ్రీశంకరాస్‌లో ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న కరస్పాండెంట్ తిమ్మయ్య

కర్నూలు సిటీ: శ్రీశంకరాస్ డిగ్రీ కాలేజీలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఆ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ హరికిషన్ అధ్యక్షత జరిగిన ఈ వేడుకలకు కాలేజీ కరస్పాండెంట్ తిమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమని, ఆ క్రమశిక్షణే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకుపోతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను శాశ్వతంగా అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను శాశ్వతంగా అమలు చేయాలని డీహెచ్‌పీఎస్(దళిత హక్కుల పోరాట సమితి) డిమాండ్ చేసింది. శనివారం కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువు ముగుస్తుండడంతో పొడిగించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మహేష్ మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్-2023 గడువు ఈనెల 23వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ చట్టం ద్వారా ఎస్సీ,ఎస్టీ వాడాలకు ఎంతో మేలు జరుగుతుండడంతో శాశ్వతంగా అమలు చేయాలని కోరారు. బీసన్న, రంగనాయకులు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 22, 23 తేదీలలో నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో నిర్వహించనున్న 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ బాల బాలికల పోటీల్లో జిల్లా జట్టు సత్తా చాటాలని గోరుకల్లు డ్యాం ఈఈ శుభకుమార్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈఈ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ సంఘం కార్యదర్శి వంశీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికా వారోత్సవాలను జయప్రదం చేద్దాం

● కలెక్టర్ పి.కోటేశ్వరరావు



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

కర్నూలు(సెంట్రల్): జనవరి 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే జాతీయ బాలికా వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో బేటీ పడావో బేటీ బచావో వాల్ పోస్టర్లను ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం, ఎమ్మిగనూరు, కోడుమూరు శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, డాక్టర్ జె.సుధాకర్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. బాలికల హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా బాలిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షించుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలిక విద్య ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌పీడీ కుమారి పాల్గొన్నారు.

సర్వీసులు పెండింగ్‌లో ఉండరాదు



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కర్నూలు (టౌన్): సచివాలయాలకు వచ్చే సర్వీసులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శనివారం స్థానిక బి.క్యాంపులోని 56వ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వచ్చే అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఆదేశించారు.

రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలి

కర్నూలు(హాస్పిటల్): పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక వడ్డేగేరిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, వార్డు హెల్త్ సెక్రటరీలకు చెవి, ముక్కు, గొంతు, కన్నులకు వ్యాపించే వ్యాధులపై ఆయన శిక్షణ ఇచ్చారు. మాతాశిశుమరణాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ స్త్రీ బిడ్డకు జన్మనిస్తూ మరణించకూడదని, ఏ శిశువు మరణించడానికి జన్మించకూడదన్నారు. ప్రధానంగా గర్భిణుల నమోదు, ప్రమాదకర గర్భిణులను గుర్తించి చికిత్స చేయించడం, రక్తహీనత నివారణ చర్యలు, వ్యాధినిరోధక టీకాలపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గర్భిణులు, శిశువుల్లో ప్రమాదకర ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి సరైన సమయంలో సేవలందించాలని సూచించారు.

ప్రాణాలు రక్షించేందుకు శిక్షణ అవసరం

● జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి

కర్నూలు(అర్బన్): ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు శిక్షణ అవసరమని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ, విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎంపికైన ఆపద మిత్రలకు (వలంటీర్లు, ఆశావర్కర్లు) స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ ... గతంలో వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో ముందుగా రెవెన్యూ శాఖ గుర్తుకు వచ్చేదన్నారు. వారికి సమాచారం అందిన అనంతరం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ టీంలు వచ్చేసరికి చాలా సమయం పట్టేదని, దీని వల్ల చాలా నష్టం జరిగేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల నుంచి స్థానికంగానే రక్షణ కల్పించేందుకు ఒక్కో బ్యాచ్‌కు 12 రోజుల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 150 మంది ఆపదమిత్రలకు మూడు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణను ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 84 మందికి శిక్షణ పూర్తి కాగా, మిగిలిన 66 మందికి ప్రస్తుతం శిక్షణ కొనసాగుతున్నదన్నారు. ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్ మాట్లాడుతు.. ఈ శిక్షణకు ఉమ్మడి జిల్లాలోని కమ్యూనిటీ వలంటీర్లు, ఆశావర్కర్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. కరోనా సమయంలో కూడా ఆశావర్కర్లు, వలంటీర్లు విశేషమైన సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ రిసోర్సు పర్సన్ దినకర్‌బాబు, రాజవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి



ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులకు కరపత్రాన్ని అందజేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్‌సీపీ శాసనమండలి పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. శనివారం ఆయన వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి మండలి ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సాయంత్రం వెంకటరమణ కాలనీలో పార్టీ నాయకులు, మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా తాను పనిచేస్తానని, ఆయనను బలపరిచేందుకు తనను గెలిపించాలని కోరారు. పట్టభద్రుల సమస్యలతో పాటు రాయలసీమ వాణిని మండలిలో వినిపిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమారస్వామి రెడ్డి, రాజశేఖర్, భాస్కర్ రెడ్డి, ప్రతాపుడు, మధుసూదన రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి



భక్తి సమ్మేళనం స్మరణ సంచికను ఆవిష్కరిస్తున్న రామకృషన్ మిషన్ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని రామకృష్ణ మిషన్ కడప కార్యదర్శి స్వామి భీతిహరానంద మహరాజ్ అన్నారు. రాష్ట్రస్థాయి భక్తి సమ్మేళనంలో భాగంగా రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు వీఆర్ కాలనీలో రెండో రోజు శనివారం స్మరణ సంచిక ఆవిష్కరించారు. అలాగే మహిళా సదస్సు నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కడప కార్యదర్శి స్వామి భీతిహరానంద మహరాజ్, స్వామి సన్నివాసానంద, రామకృష్ణ మఠం రాజమహేంద్రవరం అధ్యక్షులు స్వామి వినిశ్చలానంద మహరాజ్, రామకృష్ణ మిషన్ తిరుపతి కార్యదర్శి, రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఆర్‌వీబీపీపీ) రాయలసీమ అధ్యక్షులు స్వామి సుకృతానంద మహరాజ్, వారణాసి మఠం నందీశ్వరరానంద సందేశమిచ్చారు. రామకృష్ణ పరమ హంస, వివేకానంద, శారదామయి ప్రబోధనలు ప్రతి ఇంటికి చేరాలన్నారు. విలువలతో కూడిన జీవనం సాగించాలన్నారు. గుంటూరు శారదా మఠం ప్రవ్రాజిక ధర్మాత్మ ప్రాణ మాతాజీ, బోధమయ ప్రాణ మాతాజీ, డాక్టర్ లీల, పార్వతీ దేవిలు శారదమ్మ భావ సమాధులు, శారదా మాత – ఆధ్యాత్మిక జీవితం అనే అంశాలపై మహిళా సదస్సు నిర్వహించారు. కన్వీనర్ డాక్టర్ నాగత్రిశూల పాణి, నిర్వాహణ కార్యదర్శి డాక్టర్ కేజీ శరత్ చంద్రబాబు, రామకృష్ణ సేవా సమితి నగర అధ్యక్షులు కేజీ గోవిందరెడ్డి, కర్నూలు కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రామ్‌తో ఎన్నో ఉపయోగాలు

కర్నూలు(రాజ్‌విహార్): ఈ-శ్రామ్ కార్డులతో అసంఘటిత కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందవచ్చని సూచించారు.

27న అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో ఈనెల 27న కర్నూలు, నంద్యాల జిల్లాల అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షులు గుడిపల్లి సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నటు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ రుసుం రూ.10లు చెల్లించి నేరుగా పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9393827585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా పంచాక్షరి జపయజ్ఞం



పూజ సామగ్రితో యజ్ఞానికి వస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శనివారం పంచాక్షరీ జప యజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచాక్షరీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ డైరెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డితో పాటు దాదాపు 500 మంది భక్తులు పంచాక్షరి జప యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో నిర్మిస్తున్న శ్రీ కైలాస ప్రస్తార మహా మేరు పంచముఖ ఉమామహేశ్వర దేవ స్థానం నిర్మాణం సజావుగా కొనసాగాలని పంచాక్షరీ జపయజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి, నిత్యాన్నదాన సంస్థ కార్యదర్శి దస్తగిరిరెడ్డి, రామారెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ టారిఫ్‌పై ముగిసిన అభిప్రాయ సేకరణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చేపట్టిన విచారణ శనివారంతో ముగిసింది. విశాఖపట్నం నుంచి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచకూడదని, మెరుగైన సరఫరా అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి విన్నవించారు. వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిబంధనలను సడలించాలని క్రెడయ్ ప్రతినిధి తారకేశ్వర్ కోరారు. ఇది తమ పరిధిలోని లేని అంశమని, సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ పేర్కొంది. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి, ఈఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం

కర్నూలు(అర్బన్): సమాజంలో ఆడపిల్లలను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కేఎల్‌ఆర్‌కే కుమారి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఎస్‌సీ, బీసీ బాలికల వసతి గృహ సముదాయంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల చిన్న చూపు చూడరాదని, మగపిల్లలతో పాటు సమానంగా చదివించాలన్నారు. ఆడపిల్లలు చదువుకుంటేనే కుటుంబాలు బాగు పడతాయన్నారు. ఆడపిల్లల రక్షణకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దిశ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు డీపీ సులోచన తదితరులు పాల్గొన్నారు.

డిస్కౌంటుపై హస్తకళా వస్తువులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్స్(హస్తకళలు) ఎంపోరియంలో వివిధ వస్తువులను తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లుగా ఎంపోరియమ్ మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. లేపాక్షి హస్తకళల ఎంపోరియం అనేక కళాఖండాలకు నిలయమని, ఇందులో ఎంపిక చేసిన వాటికి మాత్రమే 50 శాతం వరకు డిస్కౌంటు వర్తిస్తుందని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 29 వరకు మాత్రమే ఉంటుందన్నారు. మిగిలిన అన్నింటిపైన 10 శాతం డిస్కౌంటు ఉంటుందని తెలిపారు.

29న బహుమతుల ప్రదానం

కర్నూలు కల్చరల్: ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆధునిక నృత్య పోటీల విజేతల వివరాలను ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. సబ్‌జూనియర్స్ సోలో విభాగం నుంచి యశస్విని రెడ్డి, ప్రణీత్, యుక్త సయజ్ఞలు మొదటి మూడుస్థానాల్లో నిలిచారని తెలిపారు. డ్యూయెట్ కేటగిరీలో అమ్ము, రిషిక, శ్రీవిద్య, అన్విత, నిఖిత, గ్రూప్స్ విభాగంలో ఛత్రి, పూర్ణిమ, పల్లవి గ్రూప్స్, జూనియర్స్ విభాగంలో సోలోలో ఉదయ కాంతి, ప్రణవ్, డస్విన్, డ్యూయెట్‌లో వేద, సత్య శ్రీకాంత్, శృతి సాయి, గ్రూప్స్‌లో శాన్విశ్రీ, అవని, డస్విన్, సీనియర్స్ విభాగం సోలోలో రాజేశ్వరి, సుభాష్, శ్రీకాంత్, డ్యూయెట్‌లో స్వప్న, మహిత, ప్రవల్లికలు విజేతలుగా నిలిచారన్నారు. వారికి 29న కృష్ణా నగర్ రైల్వే గేట్ సమీపంలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాణ ప్రతిష్ఠ

కర్నూలు కల్చరల్: నగర శివారు పంచలింగాల కూడలి సమీపంలో మహావీర్ ధామ్ ఆలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రాణ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొని ఆచార్య భగవత్ తీర్థ చంద్ర సుర్జీ ఆశీర్వాదాలు అందుకున్నారు.

నేడు ఉపాధ్యాయుల సమావేశం

కర్నూలు సిటీ: నగర శివారులోని ఇండస్ స్కూల్‌లో నేటి(ఆదివారం)ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి , పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి రామచంద్రారెడ్డి హాజరుకానున్నారు.

ప్రణాళిక బద్ధంగా చదవాలి

కర్నూలు సిటీ: పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను ప్రణాళిక బద్ధంగా చదవాలని ప్రముఖ సైకాలజిస్టు డా.శిరిగిరెడ్డి జయారెడ్డి సూచించారు. శనివారం కేవీఆర్ జూనియర్ కాలేజీలో పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

నూతన కమిటీలో చోటు

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ విశ్వ విద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం(ఏపీయూఎన్‌టీఈఏ)నూతన కార్యవర్గంలో రాయలసీమ యూనివర్శిటీ ఉద్యోగికి చోటు దక్కింది. వర్సిటీలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగి సురేంద్రబాబు కమిటీలో సెక్రటరీ జనరల్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

26 నుంచి అన్నదాన ప్రసాద వితరణ

కర్నూలు కల్చరల్: బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఉచిత నారాయణ అన్న ప్రసాద వితరణ పథకాన్ని ప్రారంభిస్తున్నామని మండలి ప్రతినిధి సండేల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయంలో కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబాల్లో ఎవరైనా మరణించిన రోజు నుంచి దహన సంస్కారాలు నిర్వహించే వరకు ఒక్క పూట 50 మందికి సరిపడ భోజనాలు అందించనున్నామన్నారు. ఈ పథకం కేవలం బ్రాహ్మణులకు మాత్రమే అమలు చేస్తున్నామన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కేసీ కల్కూర తదితరులు పాల్గొన్నారు.

23న రక్తదాన శిబిరం

కర్నూలు కల్చరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి (పరాక్రమ దివస్)ని పురస్కరించుకొని ఈ నెల 23వ తేదీన యువ భారత్ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం దారుణం

● గిరిజన మంత్రిని అవమానించిన వారిపై కేసు నమోదు చేయాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పిడికి రాజన్నదొరకు ప్రొటోకాల్ పాటించకుండా అవమాన పరిచిన అధికారులపై ఎస్‌సీ, ఎస్‌టీ కేసు నమోదు చేయాలని టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో చంద్రప్ప మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పర్యటనలో భాగంగా నంద్యాలకు వచ్చిన మంత్రి రాజన్నదొరకు శ్రీశైలం ఐటీడీఏ పీఓ, నంద్యాల డీటీడబ్ల్యూఓ ప్రొటోకాల్ పాటించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో టీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ రామరాజు, పీ వెంకటేష్, నాయకులు రమేష్, సురేష్‌నాయక్, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పొత్తు విషయం త్వరలో చెబుతాం'

కర్నూలు(టౌన్): వచ్చే ఎన్నికల్లో పొత్తు ఎవరితో అనేది త్వరలో చెబుతామని, పొత్తులు లేకుంటే రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు కొణిదెల నాగబాబు తెలిపారు. శనివారం స్థానిక మౌర్య ఇన్‌లోని పరిణయ హాలులో జనసేన పార్టీ వీర మహిళలు, జన సైనికుల జిల్లా స్థాయి సామూహిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగబాబు మాట్లాడుతూ.. జనసేన పార్టీ సామాన్యుల కోసం పుట్టిన పార్టీ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఎలా ముందుకు పోవాలనే విషయమై చర్చిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు చిలకం మధుసూదన్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయవాది కల్యాణ్ దిలీప్ సుంకర, తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కందుల దుర్గేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి పన్ను నుంచి మినహాయించాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(సెంట్రల్): జర్నలిస్టులకు వృత్తి పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి డిమాండ్ చేశారు. శనివారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డికి పలువురు జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ...గతేడాది రాజంపేటలో వృత్తి పన్ను కట్టాలని జర్నలిస్టులకు నోటీసులు రావడంతో అప్పట్లో ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందన్నారు. మళ్లీ ఈ యేడాది అమలాపురంలోని జర్నలిస్టులకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు.

జి.పుల్లయ్య కాలేజీలో క్యాంపస్ సెలక్షన్లు

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం ఆ కాలేజీలో ఐసీఐసీఐ బ్యాంకు వారు నిర్వహించి క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు పొందారు. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ డా.బి శ్రీనివాసరావు తెలిపారు. ప్రాంగణ నియామకాల్లో కస్టమర్ రిలేషన్ మేనేజర్లుగా 35 మంది ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ వై.పాండురంగయ్య, ఎంబీఏ విభాగాధిపతి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ డా.ఎం గిరిధర్‌కుమార్‌లు అభినందించారు.

In the Court of the Prl Senior Civil Judge - Kurnool
IA No. 7/2023 in O.S. No. 1/2023

Plot Owners in Sy.No. 161 and 162 of Joharapuram Village, Kurnool reb by T.Koteswara Reddy and others .. **Petitioners**

-Vs-

P.Bangaraiah and Others ..**Respondents**

పై అర్జీలో కనపరచిన అర్జీదారు జొహరాపురం గ్రామంలో సర్వే నెం. 161 మరియు 162 లలో గల హౌస్ సైట్ల స్థలం తమ హక్కు స్వాధీన అనుభవంలో వున్నదని 1 మరియు 2వ రెస్పాండెంట్లు ఈ హౌస్ ప్లాటు స్థలం తమదని ఫోర్జరీ పత్రములు సృష్టించి 3 మరియు 4వ రెస్పాండెంట్లకు అమ్మి రిజిష్టరు చేయించి యిచ్చారని వారు మా హక్కుకు ఆటంకం కల్గిస్తున్నందున వారు ఈ ప్లాట్లలోకి రాకుండా నిషేధపు ఉత్తర్వులు యివ్వమని, ఆ విక్రయాన్ని రద్దు పరచి, తమ హక్కును పరిరక్షించమని కోరుచూ, అలాగే జొహరాపురం గ్రామంలో వున్న యితర ప్లాట్ల హక్కుదారుల తరఫున కూడా అర్జీదార్లు దావా వ్యాజ్యము జరుపుటకు, కోర్టు వారు పర్మిషన్ యివ్వమని కోరుచూ సదరు అర్జీ (దావా) సదరు కోర్టులో దాఖలు చేసుకున్నారు. ఈ విషయంలో రెస్పాండెంట్లు 1 టు 4 లకు ఎవరికేమైన అభ్యంతరములుంటే సదరు కోర్టులో 06-02-2023న ఉదయం 10.30 గంటలకు మీరు స్వయముగా కాని, అడ్వకేటు ద్వారా కాని హాజరై తమకు గల అభ్యంతరములను తెలుపుకోవలసినది. లేనిచో పై అర్జి మీ పరోక్షములో తీర్మానించబడునని ఈ బహిరంగ ప్రకటన మూలంగా తెలియపరచడమైనది.

'A' Schedule: Landed property situated within the Registration and Sub- Registration District of Kurnool and within the Sub-Division limits of Kurnool and Joharapuram village limits: Land bearing Survey No. 161, Ac. 11.27 cents, full extent,
Bounded by East: Pasupula village polimera, **West:** Rastha, **North:** Land of Pinjari Masumanna, **South:** land of Kuruva Chinna Naganna,
'B' Schedule: House plots situated in Sy No. 161 & 162 of Joharapuram village limits as per approved lay out in LP.No. 422/1987 within the Kurnool Municipal Corporation limits in Sivapriya Nagar.

1. 1st plaintiff plot bearing plot No. 301
Bounded by: East: road, **West:** plot No. 302, **North:** road, **South:** Plot No. 308. **Measuring:** East-West: 40', North-South: 55' Ext: 244.4 Sq. Yards M.V.of Rs. 14,66,400/-
2. 2nd plaintiff plot bearing plot No. 303A
Bounded by: East: Plot No. 302B, **West:** plot No. 303B, **North:** 33' road, **South:** Plot No. 310A, **Measuring:** East-West 20', North-South: 55'
Ext: 122.2 Sq Yards, M.V of Rs. 7,33,320/-
3. 3rd plaintiff plot bearing plot No. 303B
Bounded by: East: Plot No. 303A, **West:** plot No. 304A, **North:** 33' road, **South:** Plot No. 310B, **Measuring:** East-West: 20', North-South: 55'
Ext 122.2 Sq. Yards, M.V.of Rs. 7,33,320/-
4. 4th plaintiff plot bearing plot No. 306
Bounded by: East: Plot No. 305, **West:** remaining half plot No. 305, **North:** 33' road, South: Plot No. 313. Measuring: East-West: 20', North-South: 55'
Ext: 122.22 Sq. Yards, M.V.of Rs. 7,33,320/-
5. 5th plaintiff plot bearing plot No. 273 Northern side half
Bounded by: East: 33' road, **West:** plot No. 263, **North:** Plot No.272, **South:** remaining half Plot No. 273, **Measuring:** East-West: 55', North-South: 20
Ext: 122.2 sq. yards. M.V.of Rs.7,33,320/-
6. 6th plaintiff plot bearing plot No. 310 A&B
Bounded by: East: Plot No. 309, **West:** plot No. 311, **North:** Plot No. 303, **South:** 33' road, **Measuring:** East-West: 40', North-South: 55'
Ext: 2200 sq. feets M.V.of Rs. 14,66,640/-

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

A.Sivaramaiah, N.Venkata Rao, Advocates, Kurnool. Cell: 94402 82434